ప్రజాశక్తి
బుధవారం 4 జనవరి 2023
5
పార్వతీపురం మన్యం



పాస్‌పోర్ట్ సెల్ ప్రారంభం

పార్వతీపురం టౌన్ : స్థానిక జిల్లా స్పెషల్ బ్రాంచి కార్యాలయంలో కొత్తగా పాస్‌పోర్టు సెల్‌ను ఎస్‌పి వి.విద్యా సాగర్‌నాయుడు మంగళ వారం ప్రారంభించారు. స్పెషల్ బ్రాంచ్ సిఐ నేతృత్వంలో సిబ్బందితో అధునాతన కంప్యూటర్లతో ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ కొత్త సంత్సరం నుంచి పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ కొత్తగా ఏర్పాటు చేసిన ఈసెల్‌లో జరుగుతా యన్నారు. కార్యక్రమంలో ఎఎస్‌పి ఒ.దిలీప్ కిరణ్, డిఎస్‌పిలు, సిఐలు, ఎస్‌ఐ, స్పెషల్ బ్రాంచ్, జిల్లా పాస్‌పోర్ట్ సెల్ ఇన్‌ఛార్జి సిఐ ఎన్.శ్రీనివాస్ పాల్గొన్నారు.



పాస్‌పోర్టు సెల్ ప్రారంభిస్తున్న ఎస్‌పి

రైతులకు బిల్లులు చెల్లించే బాధ్యత అధికారులదే : కలెక్టర్

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఖరీఫ్‌లో ధాన్యం సేకరణ త్వరగా పూర్తిచేసి, రైతులకు సకాలంలో డబ్బులు ఇప్పించే బాధ్యత అధికారులదేనని కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. మంగళవారం కలెక్టరు కార్యాలయ సమావేశమందిరంలో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టరు మాట్లాడుతూ ధాన్యం సేకరణపై ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, రైతుభరోసా కేంద్రాల స్థాయిలో డేటా సేకరిస్తున్నారని, కావున ధాన్యం సేకరణ ప్రక్రియలో నిర్లక్ష్యం వహించకూడదని తెలిపారు. జిల్లాలో ధాన్యం సేకరణ సుమారు 60శాతం పూర్తి చేశామని, లక్షా91వేల మెట్రిక్ టన్నులు లక్ష్యం కాగా ఇప్పటి వరకూ లక్షా14వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని తెలిపారు. ధాన్యం సేకరణ ప్రక్రియ వేగవంతం చేసి లక్ష్యాన్ని పూర్తిచేయాలన్నారు. రైతులకు సకాలంలో డబ్బులు చెల్లింపులు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఆ బాధ్యత అధికారులదేనని తెలిపారు. మిల్లర్ల దగ్గర ఎక్నాలడ్జ్మెంటు వెంటనే జనరేట్ చేయాలని, ఆలస్యమైతే రైతులకు డబ్బులు జమచేయడం కూడా ఆలస్యమవుతుందని తెలిపారు. దీనివలన రైతులు ఇబ్బందులు పడతారని, ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందన్నారు. ధాన్యం సేకరించకుండానే ట్రక్ షీట్స్ జనరేట్ చేస్తున్నారని అటువంటి సిబ్బందిపై అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వాహనాలు కావలసిన అధికారులు ప్రతిరోజూ వివరాలు తెలియజేస్తే, వాహనాలు సమకూర్చుతామని అన్నారు.

ఇక రబీకి సంబంధించి విత్తనాలు పంపిణీ పూర్తిచేయాలన్నారు. వరి సాగు తగ్గించాలని, ప్రత్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. రబీ పంట ఇ-క్రాప్ బుకింగు పూర్తిచేయాలని, పిఎం కిసాన్ పథకానికి ఇ-కెవైసీ చేయించాలని తెలిపారు. రైతులకు కావాల్సిన ఎరువులు, పురుగుమందులు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఉద్యాన రైతులకు కావాల్సిన కూరగాయల విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సిద్ధం చేసుకోవాలని, రైతు భరోసా కేంద్రాలో వీటిని ఎళ్లవేళలా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. జీడిమామిడి పంటకు నష్టం జరిగితే ఇన్యూరెన్స్ వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇన్సూరెన్స్ చేయడానికి కావాల్సిన డేటా నమోదులో జాగ్రత్త వహించాలని, దిగుబడి అంచనాకు, దిగుబడికి గల వ్యత్యాసం తక్కువగా ఉంటే ఇన్సూరెన్స్ వచ్చే అవకాశం తక్కువని, ఇన్సూరెన్స్ కంపెనీలు సేకరించే డేటా రైతులకు ఇన్సూరెన్స్ వర్తించేలా చూడాలని తెలిపారు. సమావేశంలో సివిల్ సప్లయ్ డిఎం ఎం.డి.నాయక్, జిల్లా వ్యవసాయశాఖ జెడి రాబర్ట్‌పాల్, జిల్లా ఉద్యాన అధికారి కె.వి.ఎస్.ఎన్ రెడ్డి, జిల్లా మత్స్య శాఖ అధికారి వేమూరి తిరుపతయ్య, డిఎస్‌ఒ కె.వి.ఎల్.ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

మరీ ఇంతదారుణమా..!

- సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుటే రోడ్డుపై మురుగునీరు
- పట్టని నగర పంచాయతీ అధికారులు

ప్రజాశక్తి-పాలకొండ

నగర పంచాయతీ అధికారులకు పారిశుధ్యంపై దృష్టిపెట్టాలని సబ్ కలెక్టర్ ఎప్పటికప్పుడు ఆదేశిస్తున్నా వారు పెడచెవిన పెడుతున్నారు. పలుమార్లు పలు వార్డుల్లోని వీధుల్లో తిరిగి పారిశుధ్య నిర్వహణకు తగు చర్యలు చేపట్టాలని ఆదేశిస్తున్నా పట్టించుకోవడం లేదు. చివరికి సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుటే అపారిశుధ్యం తాండ టవిస్తుంది. దీనిబట్టి నగర పంచాయతీ అధికారులు ఎంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం అవుతుంది. కనీసం పట్టణమంతా ఎలాగూ శుభ్రం చేయలేక పోతున్నారు. కనీసం ఒక ఐఎఎస్ అధికారి ఉంటున్న కార్యాలయం దగ్గర్లోనే పారిశుధ్య నిర్వహణ అధ్వాన్నంగా ఉండడంతో పలువురు ముక్కున వేలేసుకుంటున్నారు. డివిజన్ కేంద్రమైన పాలకొండ పట్టణంలో ఈ పరిస్థితి ఈ నాటిది కాదు. ఎంతమంది అధికారులు మారినా, ఎన్ని పాలకవర్గాలు వచ్చినా పారిశుధ్య నిర్వహణపై మాత్రం శ్రద్ధ పెట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధాన రహదారుల్లో కూడా పారిశుధ్యం అధ్వాన్నంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలువల్లో పూడికతీతలు తీయక పోవడంతో మురుగునీరు రోడ్లుపైనే ప్రవహి స్తుంది. దీంతో దోమలబెడద కూడా ఎక్కువగానే ఉంది. అలాగే ఎక్కడికక్కడ చెత్తాచెదారం పేరుకుపోవడంతో పందులు స్వైరవిహారం చేస్తున్నారు. కాలువల్లో పూడికలు పేరుకు పోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఇప్పటికైనా నగర పంచాయతీ అధికారులు పారిశుధ్య నిర్వహణపై దృష్టిపెట్టాలని పలువురు కోరుతున్నారు.



సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు



హౌసింగ్ అధికారులతో చర్చిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

గృహ నిర్మాణాలను వేగవంతం

హౌసింగ్ అధికారులతో సమీక్షలో డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - సాలూరు

నియోజకవర్గ పరిధిలో జగనన్న లేఅవుట్లలో పేదల ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర ఆదేశించారు. మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన నాలుగు మండలాల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని గుమడాం లేఅవుట్ -5లో ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించేలా చూడాలని కోరారు. ఇంకా ప్రారంభించని ఇళ్ల లబ్దిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. గిరిశిఖర గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. ఒటిఎస్ కింద డబ్బులు చెల్లించిన లబ్దిదారులకు డాక్యుమెంట్లు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. రాష్ట్ర కార్యాలయం నుంచి డాక్యుమెంట్లు రావాల్సి వుందని హౌసింగ్ పిడి రఘురాం తెలిపారు. సమావేశంలో డిఇ జి.సోమేశ్వరరావు, అర్బన్ ఎఇ టి.శ్రీనివాసరావు, రూరల్ ఎఇ కె.సత్యనారాయణ, వర్క్ ఇన్స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.

జీవోను ఉపసంహరించుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - కలెక్టరేట్

రాష్ట్రంలో రోడ్‌షోలు, ర్యాలీలు నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒలను తక్షణమే ఉపసంహరించాలని సిపిఎం పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. జిఒ రద్దు చేయాలని కోరుతూ ఎక్కడికక్కడ నిరసన తెలియజేయాలని, పౌరహక్కులు, ప్రజాతంత్ర హక్కులకు నష్టం చేసే చర్యలను ప్రజలంతా ఖండించాలని కోరారు.

ఆదర్శప్రాయులు సావిత్రీ బాయి పూలే

ప్రజాశక్తి - సాలూరు

మహిళల అక్షరాస్యత, అభివృద్ధి కోసం పోరాడిన సామాజిక కార్యకర్త సావిత్రిబాయి పూలే అదర్శప్రాయురాలని శ్రీ వెంకట విద్యాగిరి పాఠశాల కరస్పాండెంట్ కోడూరు సాయి శ్రీనివాసరావు చెప్పారు. సావిత్రభాయి పూలే జయంతి సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు ఆమె జీవితచరిత్ర, సామాజిక సేవల గురించి వివరించారు. బాలురతో పాటు బాలికలు కూడా చదువుకోవాలని పోరాడిన ధీశాలి సావిత్రిబాయి అని కొనియాడారు. దేశంలో మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా ఆమె ఖ్యాతి గడించారని చెప్పారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పి.రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీరఘట్టం : స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఇఒ పి.కృష్ణమూర్తి సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు చక్కగా చదువుకోవాలని కొనియాడారు. అనంతరం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.నాగమణిని దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, మండల అధ్యక్ష, కార్యదర్శులు కె.గౌరి నాయుడు, గోవిందరావు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ఎస్.మహేశ్వరరావు, మండల గౌరవ అధ్యక్షులు ఎ.స్వామిబాబు, జిల్లా కౌన్సిలర్ కె.విమలకుమారి, ఎస్.శ్రీనివాసరావు, డి.ఆశీర్వాదం, తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్ :మహిళా సంఘ సంస్కర్త సావిత్రీ బాయి పూలే చేసిన కృషి ఎనలేనిదని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ జి.జనార్ధన్‌నాయుడు అన్నారు. మంగళవారం కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో సావిత్రీబాయ్ పూలే జయంతి సందర్భంగా ఉమెన్ టీచర్స్‌డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సావిత్రీబాయ్‌పూలే మహిళా అభ్యున్నతికి చేసిన కృషిని వివరించారు. కార్యక్రమంలో అకడమిక్ కో-ఆర్డినేటర్ బి.జయమణి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బి.ప్రభాకరరావు, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ బి.రాజు, వాణిజ్య విభాగాధిపతి పి.రాజ్యలక్ష్మి, ఎం.ఎస్.కుమారి, ఎం.ప్రశాంతి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : ప్రముఖ సంఘ సంస్కర్త, చదువుల తల్లి, భారత దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి ప్రతి విద్యార్థికి ఆదర్శం కావాలని ప్రధానోపాధ్యాయులు ఎస్.సింహాచలం అన్నారు. పూలే 192 వ జయంతి వేడుకలు మండలంలోని మూలిగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి పూలే సేవలు, గొప్పతనాన్ని హెచ్‌ఎం విద్యార్థులకు వివరించారు. ప్రతి విద్యార్థి సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకొని క్రమశిక్షణతో చదువుకోవాలని కోరారు.

.పార్వతీపురం టౌన్ : సమాజంలో ఉన్న అసమాన తలపై అవతరణ పోరాటం చేసిన మహిళ సావిత్రిబాయి పూలే అని పార్వతీపురం మన్యం జిల్లా నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు శివప్రసాద్ అన్నారు. సావిత్రిబాయి పూలే 192 వ జయంతి సందర్భంగా మంగళవారం నాడు సంఘ సభ్యులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు ఘనంగా ఈ కార్యక్రమంలో , జిల్లా ఉపాధ్యక్షులు బో%శీ%డపల్లి వెంకటరమణ, జాయింట్ సెక్రెటరీ శ్యాంప్రసాద్, మరియు సభ్యులు అలజంగి శంకర్ రావు , కోడూరు దుర్గారావు, వేణు, శంకరు, శివన్నారాయణ, రామారావు తదితరులు పాల్గొన్నారు



వీరఘట్టం : సావిత్రీబాయి పూలే చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు



పాలకొండలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జనార్దన్‌నాయుడు

6న ధర్నా విజయవంతం చేయండి

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలోని బోయ వాల్మీకి బెంతు ఒరియా కులస్తులను ఎస్టీల్లో కలపొద్దని కోరుతూ ఈనెల 6న స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఎపి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సీదరపు అప్పారావు కోరారు. ధర్నా విజయవంతం చేయాలని కోరుతూ ముద్రించిన గోడపత్రికలను ఆయన ఆధ్వర్యాన గిరిజన సంఘం నాయకులు మంగళవారం స్థానిక సిఐటియు కార్యాలయం విడుదల చేశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్ల దాటినా గిరిజనుల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. నేటికీ రహదారి, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల్లేని ఏజెన్సీ గ్రామాలెన్నో వున్నాయని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో అభివృద్ధి చెందిన బోయ, వాల్మీకి, బెంతు ఒరియా కులస్తులను ఎస్టీల్లో కలపడానికి రాష్ట్ర ప్రభుత్వం కమిషన్‌ను నియమించడం అన్యాయమని అన్నారు. జీవో 52ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల హక్కులను కాలరాసేలా అవలంభిస్తున్నాయని చెప్పారు. ఈ విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 6న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అప్పారావు కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షులు గెమ్మెల జానకీరావు, కార్యదర్శి వంతల సుందరరావు,మండల కమిటీ సభ్యులు కూనేటి చినబాబు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మర్రి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గిరిజన సంఘం నాయకులు

నేడు ఎన్నికల పరిశీలకులు రాక

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఎన్నికల పరిశీలకులు ఎ.బాబు జిల్లాలో బుధవారం పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళ వారం ఒక ప్రకటన జారీ చేశారు. రోల్ అబ్జర్వర్ బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు పార్వతీపురం చేరుకుంటారని, భోజన విరామం అనంతరం 2 గంటల నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఓటర్ నమోదు అధికారులు, సహాయ ఓటర్ నమోదు అధికారులతో సమావేశం నిర్వహిస్తారని ఆయన చెప్పారు. కావున అధికారులు అన్ని వివరాలతో సమావేశానికి హాజరు కావాలని కలెక్టర్ పేర్కొన్నారు.



పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరుగుతున్న సిఐటియు 16వ రాష్ట్ర మహాసభలో నివేదికపై చర్చిస్తున్న సిఐటియు పార్వతీపురం మన్యం జిల్లా ప్రతినిధులు
- ప్రజాశక్తి, భీమవరం

ఎంపిడిఒ కార్యాలయంలో రికార్డుల తనిఖీ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని మంగళవారం జిల్లా పరిషత్ సిఇఒ అశోక కుమార్ సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మండలానికి కొత్తగా 527 పెన్షన్లు మంజూరయ్యాయన్నారు. పెన్షన్ వారోత్సవాల్లో భాగంగా ఈనెల 6న మండల పరిషత్ ఆధ్వర్యంలో వారోత్సవ సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. అర్హులైన హౌసింగ్ లబ్ధిదారులకు రూ.35 వేలు రుణ సౌకర్యం ఇవ్వడం జరుగుతుందన్నారు. జిపిడిపి కింద జిల్లాలోని ప్రతి మండలంలో ఐదు రోజులు చొప్పున శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. శిక్షణ అనంతరం గ్రామాల అభివృద్ధికి గ్రామ సభలు నిర్వహించి గ్రామసభల తీర్మానం ద్వారా ఆ గ్రామానికి కావాల్సిన అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందన్నారు ఇవన్నీ గ్రామ స్వరాజ్ పోర్ట్ ద్వారా అప్లోడ్ చేసి దేశవ్యాప్తంగా కార్యక్రమం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఆపతి మిత్ర పథకం కింద మన్యం జిల్లా నుంచి 150 మందిని ఎంపిక చేసి ఆశా వాలంటీర్లను ఎంపిక చేసి 12 రోజులు శిక్షణ ఇచ్చామన్నారు. వీరు ప్రకృతి వైపరీత్యాల సమయం లో ప్రమాదానికి గురైన వారిని రక్షించడం లోనూ, సాయం అందించడంలో కీలకపాత్ర వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బి.కృష్ణమహేష్ రెడ్డి, ఎఒ ఎం ఎస్ ఎల్ ప్రసాద్, ఇఒపిఆర్‌డి కెకె వర్మ ఉన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న జెడ్‌పి సిఇఒ అశోక్‌కుమార్

వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ద్వారా రైతు శిక్షణ

ప్రజాశక్తి - పాచిపెంట

2023వ సంవత్సరాన్ని చిరుధాన్యాల ఏడాదిగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సందర్భంగా రైతులు చిరుధాన్యాల సాగును పెంచాలని వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ కన్వీనర్, వ్యవసాయశాఖ ఎడి మధుసూదనరావు తెలిపారు. వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) ఆధ్వర్యంలో మండలంలోని అమ్మవలసలో సర్పంచి పెద్దింటి గంగమ్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన రైతు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పండించిన చిరుధాన్యాలను కేంద్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, గిరిజన రైతులకు 90శాతం రాయితీపై విత్తనాలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. రైతులు డ్రోన్ టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలని, కస్టం హైరింగ్ సెంటర్ ఏర్పాటు చేసుకుంటే 40 శాతం రాయితీపై రాష్ట్ర ప్రభుత్వం డ్రోన్లను అందిస్తుందని అన్నారు. అంతేకాక సుమారు రూ.50వేల విలువచేసే డ్రోన్ పైలెట్ శిక్షణను కూడా ఉచితంగా రైతులకు ఇస్తుందన్నారు. సాంకేతికతను రైతులు అందిపుచ్చుకోవాలన్నారు. తద్వారా సాగు ఖర్చులు తగ్గించుకుని దిగుబడులు పెంచుకోవా లని కోరారు. ప్రకృతి సేద్యాన్ని విస్తరింప చేయాలని, విచక్షణారహితంగా ఎరువులు, పురుగు మందులు వాడకూడదని, రైతులు సాగు ఖర్చులు తగ్గించుకొనే దిశగా ఆలోచనలు చేయాలని తెలిపారు. మండల వ్యవసాయాధికారి కె.తిరుపతి రావు మాట్లాడుతూ చోడి పంటను 12 రోజుల వయసులో అడుగున్నర దూరంలో నాటుకుని కోనోవేడర్ సహాయంతో 45 రోజుల్లోపు రెండు సార్లు కలుపు నివారణ చేసుకున్నట్లయితే ఎకరానికి సుమారు 20 బస్తాల చోడి దిగుబడి వస్తుంద న్నారు. దీన్నే గులిచోడి అంటారని, ఈ విధానం ద్వారా అతి సులువుగా అత్యధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. అనంతరం ప్రకృతి సేద్య బృందం ద్వారా బహుళ పంటల విధానం, జీవా మృతం తయారీ చూపిం చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అప్పారావు, ప్రకృతి సేద్య ప్రతినిధులు యశోదమ్మ, తిరుపతి నాయుడు, శ్రీనివాసరావు, ఐసిఆర్‌పిలు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని కుందరతిరువాడ పంచాయతీ నీచుకవలస నుండి చినకుదమ వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల వరకు పిఎంజిఎస్‌వై ఇన్సెంటివ్ రూ.80లక్షలు నిధులతో తారు రోడ్డు నిర్మాణ పనులకు చేపట్టేందుకు కురుపాం ఎమ్మెల్యే పి.పుష్ప శ్రీవాణి మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం రోడ్డు కాంట్రాక్టర్ గోపిరెడ్డితో ఎమ్మెల్యే మాట్లాడి రహదారి , కల్వర్టు పనులు సకాలంలో పూర్తి చేసి నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. గెడ్డ తిరువాడ నుంచి ఇటిక మీదుగా రావివలసకు రూ.6 కోట్ల27 లక్షల నిధులతో మంజూరైన రహదారి పనులపై డిఇ జి.శ్రీనివాసరావుతో మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ భానుమూర్తి నాయుడు, జెడ్పీటీసీ సభ్యులు ఎం.శశికళ, ఉషారాణి, వైసిపి కన్వీనర్ ఎం.గౌరీశంకర్, బడే పాపినాయుడు, పల్ల అనంత నాయుడు, కెంగువ వెంకట్నాయుడు, ఎస్ .భువన మోహనరావు, భీమవరపు సింహాచలం నాయుడు, తాడేల బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

పింఛను వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో పింఛన్ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మంగళవారం రాజమహేంద్రవరంలో పింఛన్ వారోత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో పార్వతీపురంలో ఏర్పాటు చేశారు. ఇందులో కలెక్టర్ నిశాంత్ కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, డిఆర్‌డిఎ పిడి పి.కిరణ్ కుమార్ పాల్గొన్నారు. ప్రస్తుతం ఉన్న కొత్త పింఛన్లు మంజూరుతో లక్షా42,476 కు మొత్తం పింఛన్లు చేరాయి. ఇందు కోసం ప్రభుత్వం రూ.39 కోట్లు వ్యయం చేస్తుంది. జిల్లాలో 138695 పింఛన్లు ఉండేవి. ఇప్పటివరకు విచారణ జరిపి 5781 పింఛన్లను నిర్ధారణ చేశారు. ఇంకా పింఛన్ల విచారణ జరుగుతుంది. విచారణ అనంతరం పింఛన్ల సంఖ్య మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఇందులో భాగంగా గిరి మిత్ర సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నవరత్నాలులో భాగంగా పింఛన్ల పెంపుదల పోస్టర్‌ను ఆవిష్కరించారు. పెరిగిన పింఛన్ల చెక్కులను లాంచనంగా అందజేశారు.

బాగువలసలో నేడు పింఛన్ల పంపిణీ

సాలూరు: పింఛన్ల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని బాగువలసలో పెరిగిన పింఛన్లను బుధవారం పంపిణీ చేయనున్నట్లు ఎంపిడిఒ జి.పార్వతి చెప్పారు. రూ.2500 నుంచి రూ.2750 పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో మండలస్థాయిలో పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు చెప్పారు. డిప్యూటీ ఎం రాజన్నదొర చేతులు మీదుగా పింఛన్ల పంపిణీ చేయనున్నట్లు ఎంపిడిఒ పార్వతి తెలిపారు.



లబ్ధిదారునికి పింఛను అందజేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ఆసుపత్రిలో పెన్షన్ పంపిణీ

సీతానగరం : మండలంలోని పెదబోగిలికి చెందిన జి.చిన్నమ్మ వైజాగ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకుని వాలంటీరు ఆసుపత్రికి వెళ్లి ఆమెకు పెన్షన్ అందజేశారు. అలాగే రంగంపేట పంచాయతీలో ఎంపిటిసి సభ్యులు జయలక్ష్మి ఆధ్వర్యంలో వృద్ధులకు పెన్షన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉడుముల కృష్ణ, పంచాయతీ కార్యదర్శి బి.కామేశ్వరరావు, వాలంటీర్లు పాల్గొన్నారు.

నిందితుడ్ని కఠినంగా శిక్షించాలి : టిడిపి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కిమ్మిలో తొమ్మిదేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కామాంధుని కఠినంగా శిక్షించాలని టిడిపి పాలకొండ నియోజకవర్గం ఇన్చార్జి నిమ్మక జయకృష్ణ డిమాండ్ చేశారు. బాధిత కుటుంబ సభ్యులను మంగళవారం ఆయన పరామర్శించారు. బాధితులను ఓదార్చి వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం జయకృష్ణ మాట్లాడుతూ అభమూ, శుభమూ తెలియని బాలికపై కామాంధుడు లైంగిక దాడి చేయడంతో సభ్యసమాజం తలదించుకునేలా ప్రవర్తించిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. భవిష్యత్తులో ఇటువంటి చర్యలకు పాల్పడే ఆలోచన రానివ్వకుండా బాధ్యులపై కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో టిడిపి మండల అధ్యక్షులు ఉదయాన ఉదయ్ భాస్కర్, ప్రధాన కార్యదర్శి చింత ఉమామహేశ్వరరావు, ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ వి శ్రీనివాసరావు, బి నీలకంఠం నాయుడు , డి శ్రీనివాసరావు, ఎస్ శశి కుమార్, అలజంగి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి మందులు అందజేస్తున్న పిఒ నవ్య

ఐటిఐలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

సీతంపేట : స్థానిక ప్రభుత్వ ఐటిఐలో మంగళవారం మెగా నేత్రవైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐటిడిఎ పిఒ బి.నవ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఐటిఐ ట్రైనీలు 257మందికి, స్కిల్‌హబ్ విద్యార్థులు 55 మందికి నేత్ర పరీక్షలు చేశారు. వీరిలో 15 మంది ట్రైనీలకు దృష్టి లోపానికి గానూ కళ్లద్దాలు, మరో ముగ్గురు ట్రైనీలకు శస్త్రచికిత్స అవసరమున్నట్లు తెలిపారు. ఇలాంటి నేత్ర, వైద్య శిబిరాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని పిఒ సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ కె.విజయ పార్వతి, ఐ స్పెషలిస్ట్ డాక్టర్ బి.భాగ్యశ్రీ రేఖ, ఐటిఐ ప్రిన్సిపల్ టివి గిరి, ఐ.జానకి రామయ్య, తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే జోగారావు

అభివృద్ధి ప్రణాళికపై అవగాహన అవసరం

పార్వతీపురంరూరల్ : సచివాలయ సిబ్బంది గ్రామాభివృద్ధి ప్రణాళికపై అవగాహన ఉండాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని పెదబొండపల్లి సచివాలయం ఆవరణంలో మంగళవారం సర్పంచ్ సవరపు తవుడమ్మ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రామాభివృద్ధికి చేపట్టాలని కార్యాచరణపై దిశ, దశ నిర్ధారించారు. కార్యక్రమంలో కార్యదర్శితో పాటు పిఎసిఎస్ చైర్మన్ దామోదర్, వైసిపి సీనియర్ నాయకులు సవరాపు రాజారావు, చందాన శివాజీ పాల్గొన్నారు.

హైస్కూళ్లలో డిఇఒ తనిఖీ

సీతానగరం : మండలంలోని ఆర్.వెంకంపేట, గాదెలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి డివి రమణ మంగళవారం పరిశీలించారు. పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను వేగవంతం చేయాలని పిల్లలకు ఇబ్బందుల్లేకుండా గదులు నిర్మాణం పూర్తి చేస్తే ఇబ్బంది ఉండదన్నారు ప్రభుత్వం ఇచ్చిన నాణ్యత ప్రకారం నిర్మాణ పనులు జరగాలన్నారు. అలాగే విద్యార్థులు చదువులో వారి సామర్థ్యాలను పరిశీలించేందుకు వారిని ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. అనంతరం గాదెలవలస మధ్యాహ్నం భోజన పథకం పరిశీలించారు. భోజనం నాణ్యత ప్రమాణంతో ఉండాలని, విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒ జి.సూర్యదేవుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌టిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

గుమ్మలక్ష్మీపురం : వైఎస్ఆర్‌టిఎఫ్ ప్రచురించిన నూతన సంవత్సర కేలండర్‌ను కురుపాం ఎమ్మెల్యే పి. పుష్ప శ్రీవాణి మంగళవారం ఆవిష్కరించారు. ఈ మేరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ వైయస్సార్ టీచర్ ఫెడరేషన్ ఉపాధ్యాయుల కోసం ఎల్లప్పుడూ విశ్రమం లేకుండా పనిచేస్తుందన్నారు. ఈ మేరకు ఉపాధ్యాయులు వైయస్సార్ టీచర్ ఫెడరేషన్ సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, వైఎస్ఆర్ టీచర్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్ల సీతన్న, మాధవ, పలువురు ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎంవిఐ సత్యనారాయణ

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన తప్పనిసరి

గుమ్మలక్ష్మీపురం : ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జి.సత్యనారాయణ సూచించారు. గుమ్మలక్ష్మీపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో సమావేశమయ్యారు. విద్యార్థులు రోడ్డుపై నడిచేటప్పుడు తప్పనిసరిగా రోడ్డు నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు గురించి తెలిసి ఉండాలన్నారు. అలాగే తమ పెద్దలకు కూడా రోడ్డు నియమాలపై అవగాహన కల్పించాలన్నారు. ద్విచక్ర వాహనాలపై, కారులో వెళ్లేటప్పుడు క్రమశిక్షణా బద్ధంగా ప్రయాణం చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా వెళ్లకపోతే ప్రభుత్వం నిర్దేశించిన క్రమశిక్షణా చర్యలకు బాధ్యులవుతారని అన్నారు. కార్యక్రమంలో ఎల్విన్‌పేట ఎస్ఐ షణ్ముఖరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

కలెక్టరేట్ : విఆర్ఒలు, విఆర్ఎలపై అనుచిత వ్యాఖ్యలను చేసిన ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని విఆర్ఎల సంఘం జిల్లా అధ్యక్షులు జి.ఈశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని పులిచింతలో ఇటీవల జరిగిన భూహక్కు పత్రాలు పంపిణీ కార్యక్రమంలో విఆర్ఒలు, విఆర్ఎల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడిన ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే తన మాటలను వెనక్కి తీసుకోవాలని, లేనిచో రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి పులుపు ఇవ్వడానికి వెనకాడబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో విఆర్ఎల సంఘం జిల్లా కార్యదర్శి జి.కృష్ణారావు, మక్కువ మండల అధ్యక్షులు జి.సాంబమూర్తి పాల్గొన్నారు.

ఒబ్బంగిలో ఉచిత వైద్య శిబిరం

కురుపాం : మండలంలోని ఒబ్బంగిలో మంగళవారం 104 ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నీలకంఠాపురం పిహెచ్‌సి వైద్యసిబ్బంది నిర్వహించారు. గ్రామంలోని 47 మందికి వైద్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం శారీరక ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు పి.అభినవ కుమార్, సిబ్బంది శ్రీహరిరావు తదితరులు పాల్గొన్నారు.

రక్షిత మంచినీటి పైప్ లైన్ పనులు

వీరఘట్టం : మండల కేంద్రంలోని రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీరందించేందుకు వీలుగా పైప్లైన్ ఏర్పాటుకు జెసిబి ద్వారా తవ్వకాలు జరుపుతున్నారు. ప్రధాన రహదారికి ఇరువైపులా వట్టిగెడ్డ వంతెన నుంచి హనుమాన్ జంక్షన్ వరకు సుమారు రెండు కిలోమీటర్ల పరిధిలో ఉపాధిహామీ చట్టం ద్వారా రూ.11 లక్షల అంచనా వ్యయంతో పైపులైను పనులు చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ పాపారావు తెలిపారు.

క్రీడా మైదాన పనులు పూర్తి చేయాలి

గుమ్మలక్ష్మీపురం : స్థానిక క్రీడా మైదానం పనులు పూర్తి చేసి గిరిజన క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ అందించాలని ఎపి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మండంగి రమణ కోరారు. టిడిపి ప్రభుత్వం హయంలో నిర్మాణం చేపట్టిన ఇండోర్ స్టేడియం పనులు ప్రభుత్వం మారాక గత నాలుగేళ్లుగా నిలిచిపోయాయని తెలిపారు. కురుపాం, గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ మండలాల్లో వందలాది మంది క్రీడాకారులు ఉన్నారని, వీరిలో ప్రతిభ వెలికి తీయడానికి క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిర్మాణంలో ఉన్న క్రీడా మైదానం పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన కోరారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షులుగా తిరుపతిరావు

ప్రజాశక్తి - సీతానగరం

మండలం పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా మంగళవారం జరిగింది. ఇఒపిఆర్‌డి కెకె వర్మ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. సంఘం అధ్యక్షులుగా నిడుగల్లు పంచాయతీ కార్యదర్శి పి.తిరుపతిరావు, కార్యదర్శిగా చల్లమనాయుడువలస పంచాయతీ కార్యదర్శి పీటర్, గౌరవాధ్యక్షులుగా పెదబోగిలి కార్యదర్శి జి.వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా కొత్తవలస కార్యదర్శి గౌతమి, సంయుక్త కార్యదర్శిగా కృష్ణరాయపురం పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాసరావు, కోశాధికారిగా సిలబౌలి సెక్రటరీ బి.మనోహర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన నూతన కమిటీకి పంచాయతీ కార్యదర్శులు శుభాకాంక్షలు తెలిపారు.

బ్రిటీష్ వారిని తలపిస్తున్న వైసిపి పాలన

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

రాష్ట్రంలో వైసిపి పాలనపై విసిగిపోయిన జనం టిడిపితో సహా ప్రతిపక్ష నాయకుల సమావేశాలకు చూపిస్తున్న ఆదరణ తట్టుకోలేక ర్యాలీలపై నిషేధం విధిస్తూ ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం బ్రిటిష్ పాలనను తలపిస్తోందని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్ అన్నారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దురదృష్టకరంగా జరిగిన ఒకటి, రెండు సంఘటనలను సాకుగా చూపిస్తూ వైసిపి ప్రభుత్వం ర్యాలీలు, బహిరంగ సభలపై నిషేధాన్ని విధిస్తూ తమ అక్కసును ప్రకటించుకుందన్నారు. నిరసనలు తెలపడం ప్రజల ప్రాథమిక హక్కు అని, ఆనాడు మహాత్మా గాంధీ ర్యాలీలు నిర్వహించి, ఉద్యమాలు చేసి స్వాతంత్రాన్ని తీసుకొచ్చారని అన్నారు. ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న కార్యక్రమాలను నియంత్రించడం చేతకాక, ఎక్కడ తమ బండారం బయటపడిపోతుందని భయపడి ముఖ్యమంత్రి ఈ చీకటి జీవోలను తీసుకువచ్చారని, జీవోలను వెనుక్కు తీసుకోకపోతే ప్రతిపక్షాలన్నీ రోడ్లపైకి వస్తాయని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ విషయమై పునరాలోచించి జీవోలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు జి.రవికుమార్, డి.మోహనరావు, కౌన్సిలర్లు బి.గౌరినాయుడు, భాస్కరరావు, రాజశేఖర్, జి.రామ్మూర్తి, నాయకులు జి.వెంకటనాయుడు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

5న పామాయిల్ కూలీల సమస్యలపై సదస్సు

ప్రజాశక్తి - సాలూరురూరల్

పామాయిల్ గెలలు నరికే కూలీల సమస్యలపై ఈనెల 5న మామిడిపల్లిలో జరిగే సభను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మికసంఘం నాయకులు కోరారు. ఈ సభను జయప్రదం చేయాలని కోరుతూ దండిగాం, చినబారిగాం, మిర్తిగుడ్డివలస, కురుకూటి గ్రామాల్లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పర్యటించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ పామాయిల్ కోత కార్మికులకు ఎటువంటి సౌకర్యం లేకుండా ప్రమాదానికి దగ్గరగా పని చేస్తున్న పరిస్థితులు ఉన్నాయన్నారు. పని చేసే సమయంలో అనేక ప్రమాదాలకు గురికావడం, శరీర బాగాలు కాలిపోవడం, గాయాలు కావడంతో వారు వికలాంగులుగా మారుతున్నారన్నారు. వీరికి గిట్టుబాటు కూలి లభించడంలేదన్నారు. పామాయిల్ కార్మికులను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పామాయిల్ కార్మికుల సమస్యలపై జనవరి 5న మామిడిపల్లిలో జరిగే సదస్సులో పామాయిల్ కార్మికులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయకార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు జన్ని ఈశ్వరరావు, పామాయిల్ కోత కార్మికులు పాల్గొన్నారు.



ప్రచారంలో భాగంగా సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

దయనీయ పరిస్థితిలో ప్రజలు

ప్రజాశక్తి - భామిని

రాష్ట్ర ప్రజలు ఎన్నడూ చూడని విధంగా ప్రస్తుత వైసిపి ప్రభుత్వం తీరు ఉందని పాలకొండ నియోజక వర్గ పరిశీలకులు రాష్ట్ర కార్యదర్శి కలమట విద్యాసాగర్ అన్నారు. మండలంలోని కొరమ, చిన్నదిమిలి గ్రామాల్లో పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు, పెరిగిన ధరలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి వివరించి, ప్రజలు మేలుకోవాలన్నారు. రాష్టంలో ఆర్థిక పరిస్థితి మెరుగుపడాలన్నా, అభివృద్ధి చెందాలంటే టిడిపి ఒక్కటే ప్రత్యామ్నాయమని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బోగాపురపు రవినాయుడు, ప్రధాన కార్యదర్శి మెడిబోయిన జగదీశ్వరరావు, మాజీ ఎంపిపి భూపతి ఆనందరావు, సర్పంచ్ లోపింటి రాజేష్, అంపిలి కేశవ, మన్మధ, గురిబిల్లి లక్ష్మీపతి, నిద్దన అప్పల నాయుడు, మల్లి కొండలరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని ఇరిడి గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఇదేమికర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కురుపాం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో అధిక ధరలు, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, తెలుగుదేశం కార్యకర్తలు నాయకులు పై వేధింపులు, ఉద్యోగులకు సకాలంలో జీతాలు రాకపోవడం తదితర అంశాలను ప్రజలకు వివరించారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న వైసిపి ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు పోలూరు శ్రీనివాసరావు, తదితర నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కురుపాం

అర్హులంతా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మంగళవారం మండలంలోని ఏగులవాడ పంచాయతీలో పలు గిరిజన గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీసి సమస్యలు ఏమైనా ఉంటే సచివాలయ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ ఉపాధ్యక్షుడు ఎం.బాపూజీనాయుడు, జడ్పీటీసీ సుజాత, నాయకులు అంధవరపు కోటేశ్వరరావు, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : రాష్ట్రంలో గిరిజనుల సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని ఆడారులో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. గిరిజనుల జీవనోపాధికి ఏ ప్రభుత్వం ఇవ్వలేనంత పోడు పట్టాలు మంజూరు చేయడమే కాకుండా గిరిజనులకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చి వైఎస్ జగన్ గౌరవించారని అన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు బలగ రేవతి, ఎంపిపి మజ్జి శోభారాణి, ఎఎంసి చైర్‌పర్సన్ ఎం.భాగ్యలక్ష్మి, నాయకులు చంద్రశేఖర్, బలగ నాగేశ్వరరావు, బొమ్మి రమేష్, బంకపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

ఓటరు జాబితా త్వరగా పరిశీలించాలి

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని ఓటరు జాబితాను త్వరగా పరిశీల పూర్తి చేయాలని తహశీల్దార్ సిహెచ్ రాధాకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద బిఎల్ఒలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో ఇప్పటికే బిఎల్ఒలు ఇంటింటికి వెళ్లి సర్వే పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. సర్వేకు సంబంధించిన నివేదికలు బిఎల్ఒలను విడతల వారీగా అడిగి తెలుసుకున్నారు. మండలంలో 60 బూతులకు సంబంధించి బిఎల్ఒలకు పలు సూచన, సలహాలు చేశారు. ఇప్పటివరకు మండలంలో మృతి చెందిన వారిని గుర్తించి తొలగింపునకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. బిఎల్ఒలు శ్రద్ధగా పనిచేస్తూ జాబితాను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన బాధ్యత ఉందన్నారు. 60 బూతుల్లో 18 డెత్‌లు ఇప్పటి వరకు వచ్చాయన్నారు. గ్రామాల్లో డెత్‌లుంటే తప్పనిసరిగా గ్రామసభలో తెలిపి తొలగించాలని సూచించారు. ఓటు తొలగింపు, చేర్పు, మార్పు తదితరు విషయంలో బిఎల్ఒలు జాగ్రత్తలు వహించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఆర్ఐ శ్రీనివాసరావు, కంప్యూటర్ ఆపరేటర్ పాండు రంగ, బిఎల్ఒలు పాల్గొన్నారు.



వైద్యాధికారికి వినతిని అందజేస్తున్న సిఐటియు నాయకులు, ఆశా కార్యకర్తలు

ఆశా వర్కర్లను ఆదుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి - కొమరాడ

వైద్య, ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించి, వారిని అన్ని విధాలా ఆదుకోవాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో కెఆర్‌బి పురం పిహెచ్‌సి వద్ద మంగళవారం నిరసన చేపట్టారు. ఈ నిరసననుద్దేశించి సాంబమూర్తి, ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు హేమలత, హైమ, ఎల్లమ్మ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు రూ.10వేలు వేతనం సక్రమంగా అందడంలేదన్నారు. ప్రతినెలా రూ.6వేలు, మరోసారి రూ.3వేలు ఇస్తున్నారు తప్ప, పూర్తిస్థాయిలో రూ.10వేలు ఒకేసారి గాని ఇచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఉద్యోగభద్రత లేదని, రాజకీయ వేధింపులు పెరిగాయని, సంక్షేమ పథకాలు పూర్తిగా నిలిపివేశారన్నారు. తక్షణమే సంక్షేమ పథకాలు అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనంగా ఇవ్వాలని కోరారు. అనంతరం పిహెచ్‌సి వైద్యాధికారులు గణేష్‌పట్నాయక్, శామ్యూల్‌జాన్‌కు వినతిని అందజేశారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పార్వతి, లక్ష్మి, సుభద్రమ్మ, గౌరి, సునీత, సుజాత, పార్వతి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలుంటే గ్రామసభలో తెలపాలి

కురుపాం : మండలంలోని జి.శివడ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి బి.చంటి ఆధ్వర్యంలో సచివాలయంలో నిర్వహించినటువంటి గ్రామసభకు ముఖ్యఅతిథిగా సర్పంచ్ బి.మిన్నారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు ఏమైనా ఉంటేగ్రామసభలో తెలియజ ేయాలన్నారు. అలాంటప్పుడు గ్రామసభలో తీర్మానించి సమస్యలు పరిష్కరించేందుకు దోహదపడతా యన్నారు. కావున ప్రజలంతా వారి గ్రామాల్లో ఏవైనా సమస్యలుంటే తప్పనిసరిగా గ్రామసభలో తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కుటుంబ ఆహార భద్రతకు పెరటి తోటలు వేయాలి

ప్రకృతి వ్యవసాయం మేనేజర్ షణ్ముఖ రాజు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కుటుంబ ఆహార భద్రతకు ప్రతి ఒక్కరూ పెరటి తోటలు వేసుకోవాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రబంధకులు పి.షణ్ముఖరాజు కోరారు. గరుగుబిల్లి మండలం తోటపల్లిలో మంచిపల్లి శ్రీరాములు క్షేత్రంలో అన్నపూర్ణ పంటల నమూనాను, మార్కిండి ఫకీరు నాయుడు పొలంలో పెరటితోటల పెంపకంపై శిక్షణ నిర్వహించారు. తోటకూర, గోంగూర, ఆనప బీర, బెండ తదితర రకాల విత్తనాలను బీజామృతంలో విత్తన శుద్ధి చేసి వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరటి తోటలు వేయడం ద్వారా అన్ని వేళల్లో అన్ని రకాల పంటలు లభ్యమవుతాయన్నారు. మానవ శరీరానికి అవసరమయ్యే అన్ని రకాల విటమిన్లు కలిగి ఉన్న ఆహార పదార్థాలు పండించుకోవడానికి ఉపయోగ కరంగా ఉంటుందన్నారు. పలు రకాల పంటలు వేసుకోవడం వల్ల రైతులకు ప్రయోజనం కలుగుతుందని, మొక్కల్లో జీవ వైవిధ్యం పెంపొందించడం జరుగుతుందని తెలిపారు. భూమిలో సేంద్రీయ కర్బనం పెంచడంతో పంటల దిగుబడికి అనుకూలంగా ఉంటుం దన్నారు. రైతు ఆనంద్ ఏడాది పొడవునా ఏ విధంగా పంటలు పండిం చడం జరుగుతుంది, భూమిలోని మార్పులు, ఉత్పత్తి చేసే పంటలు ఏ విధంగా రుచి ఉంది రైతు అనుభవాలను తెలుసుకున్నారు. జిల్లాలో ప్రతి గ్రామంలో పెరటి తోటలు రైతులు వేసుకునేలా కార్యకర్తలు శ్రద్ధ చూపాలని, ఏడాది పొడవునా పంటలు పండించుకునేలా శ్రద్ధ చూపాలని అన్నారు. కార్యక్రమంలో జట్టు ట్రస్ట్ వ్యవస్థాపకులు డి.పారి నాయుడు, సబ్ డివిజన్ యాంకర్ పర్సన్ జి.అన్నపూర్ణ ఉన్నారు.



చిరుధాన్యాల సాగును పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ మేనేజర్

సబ్సిడీపై సరుకులు సరఫరా చేయాలి

సీతంపేట : గిరిజనులకు పది రకాల నిత్యవసర సరుకులు సబ్సిడీపై సరఫరా చేయాలని సిపిఎం మండల కార్యదర్శి హారిక భాస్కరరావు డిమాండ్ చేశారు. సీతంపేటలో మంగళవారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజనులకు 10 రకాల నిత్యావసర సరుకులు సబ్సిడీపై సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం బియ్యం తప్ప ఏ సరుకులు ఇవ్వడం లేదన్నారు. నవరత్నాలు ఇచ్చిన ప్రభుత్వం ఈ పని ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతి రావు తదితరులు పాల్గున్నారు.

సచివాలయ ఉద్యోగికి తప్పిన ప్రమాదం

కొమరాడ : గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగికి మంగళవారం పెను ప్రమాదం తప్పింది. సచివాలయ ఉద్యోగి స్కూటీపై విధులకు వస్తుండగా ఆర్తాం రైల్వే గేటు వద్ద లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో గుమ్మడి గ్రామ సచివాలయంలో సర్వేయర్ సహాయకు లుగా పనిచేస్తున్న మహిళ తన స్కూటీపై పార్వతీపురం నుంచి సచివాలయానికి వస్తుండగా రైల్వే గేటు వద్ద నిర్లక్ష్యంగా వ్యవహరించిన డ్రైవరు స్కూటీని ఢీకొన్నారు. వెంటనే గమనించిన స్థానికులు హుటాహుటిన వెళ్లి స్కూటీని, గాయపడిన ఉద్యోగిని పక్కకు తీశారు. అనంతరం స్వల్ప గాయాలతో బయటపడ్డ ఉద్యోగిని అక్కడి నుంచి చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. రహదారిపై భారీగా పెరిగిన ట్రాఫిక్ తోనే ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయని ప్రజలు అంటున్నారు. భారీ వాహనాలను ఈ రహదారిపై నిషేధించాలని ప్రజలు, అధికారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



లారీ కింద నుంచి స్కూటీని బైటకు తీస్తున్న స్థానికులు